క్లుప్తంగా

'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' సీడీ ఆవిష్కరణ

చిక్కడపల్లి: 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' సీడీని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సీడీని కేసీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు సమాజ సేవకుడు రాంప్రతాప్‌రాయ్ శ్రీవాత్సవ్ కాయస్థ రూపొందించారు. పాటరచన, గానం, రూపకల్పన రాంప్రతాప్ చేశారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి



పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామని బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు నాగభూషణంచారి అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం 'పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని డివిజన్ నాయకులతో కలిసి నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుంటున్నామన్నారు. బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్, యశ్వంత్, భిక్షపతి, బ్రహ్మచారి, మైలారం రాజు, కృష్ణ ముదిరాజ్, అయోధ్యరాములు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ – విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని మహిళ (38) బుధవారం పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. రైలు ఢీకొని మృతి చెందింది. మృతురాలి ఒంటిపై ఎరుపు రంగు జాకెట్టు, ఆకు పచ్చ రంగు చీర ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్



డివిజన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: మౌలిక సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. వంద రోజుల పాటు మౌలిక సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ.. నియోజకవర్గంలో ఉన్న 5 డివిజన్లలో సమస్యలను పరిష్కరించనున్నట్లు డీఎంసీ వేణుగోపాల్ తెలిపారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం, పేరుకుపోయిన మట్టికుప్పలు, డ్రైనేజీ తదితర సమస్యలపై అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నోడల్ అధికారులు..

- అంబర్‌పేటకు ఏఎంసీ హరిశంకర్, బాగ్‌అంబర్‌పేటకు యూసీడీ అధికారిణి రజిత, నల్లకుంటకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, గోల్నాకకు డిప్యూటీ డీఈ ప్రవీణ్‌కుమార్, కాచిగూడకు ఏఈ లాల్‌సింగ్‌లు వ్యవహరించనున్నట్లు సమాచారం.

క్రీడా సామగ్రి అందజేత

ముషీరాబాద్: విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో అనాథ ఆశ్రమంలో బాలికలకు షటిల్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్యారమ్స్ తదితర క్రీడా సామగ్రిని అందజేశారు. ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కంచికుమార్, బీజేవైఎం నాయకుడు కుషాల్‌గౌడ్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: ఎంజే ఈవెంట్స్ ఆధ్వర్యంలో 'ఈ మధుమాసంలో' శీర్షికన హైకోర్టు న్యాయవాది, గాయని, సంస్థ అధ్యక్షురాలు తోట శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కళాజనార్దనమూర్తి హాజరై గాయకులను అభినందించారు. శ్రీలక్ష్మి, బాబురావు, సుబ్బిరెడ్డి, అంబాదాస్, ప్రభాకర్, బాపిరాజు, సౌభాగ్యలక్ష్మి, లక్ష్మిగోపాల్, అరుణ, లక్ష్మి, రత్నం, విజయలక్ష్మి తదితరులు ఆలపించిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

పార్కింగ్‌కు అడ్డేది.. ?

- ప్రధాన రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అసలే ఇరుకు రోడ్లు.. ఆపై వాహనాల ఆక్రమణతో రోడ్డు మరింత కుంచించుకుపోయి దారి లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాచిగూడ, గోల్నాక డివిజన్‌లలోని పలు బస్తీలు, కాలనీల రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా బర్కత్‌పుర, నారాయణగూడ, లింగంపల్లి, కుద్బిగూడ, సుందర్‌నగర్, కృష్ణానగర్, నెహ్రూనగర్, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, రత్నానగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం వాహనాలను అక్రమంగా పార్క్ చేయడంతో పాటు భవన నిర్మాణ సామగ్రీని నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణానికి తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది.



సుందర్‌నగర్‌లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

కాచిగూడ: స్టేషన్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లను వ్యాపారులు అక్రమించుకోవడంతో ప్రజలు రోడ్లపై వాహనాలను అక్రమంగా పార్క్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినా..

- వ్యాపార సంస్థలు, హోటళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని లెక్క చేయకుండా వాహనదారులు, ఆయా వ్యాపార సముదాయాల నిర్వాహకులు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- స్టేషన్ ఎదురుగా రోడ్లపైనే టీ సెంటర్లను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.
- ఫిర్యాదులు వచ్చిన సమయంలోనే జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తియించినప్పటికీ తిరిగి పరిస్థితి యథాతథంగానే కొనసాగుతోందని ఆరోపణలున్నాయి.

పార్కింగ్ సౌకర్యం లేకే..

- ఈ ప్రాంతాల్లో చాలా భవనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు.
- నింబోలిఅడ్డ ప్రధాన రహదారి, రెడ్డి ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, కుద్బిగూడ, రాజేంద్రనగర్ కాలనీ, బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ, విక్రమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది.

ప్రశ్నిస్తే తగాదా..

- పాదచారులు, ఇతరులెవరైనా.. పార్కింగ్‌పై ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని పలువురు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రోడ్లపై అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపారాలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాదచారులకు ప్రమాదాలు..

- కనీసం నడిచేందుకు కూడా దారిలేకుండా ఫుట్‌పాత్‌లను అక్రమించి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

షరా మామూలే..

- జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వంతో వ్యవహరించి రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను నిరోధించాలని ఫిర్యాదులు అందినప్పుడే అధికారులు హడావిడి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనంతరం తిరిగి షరా మామూలుగానే పార్కింగ్ కొనసాగుతోందనే విమర్శలున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



రత్నానగర్‌లో ఫుట్‌పాత్‌పై ఇలా..

'నిధుల మంజూరులో నిర్లక్ష్యం'

నల్లకుంట: డివిజన్ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు మంజూరు చేయడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నల్లకుంట కార్పొరేటర్ అమృత ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం లేకుండానే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం నల్లకుంటలో ఆమె మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా డివిజన్‌ల అభివృద్ధి కోసం కార్పొరేటర్లకు నిధులు మంజూరు చేయని రాష్ట్ర ప్రభుత్వం నియోజక వర్గం అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

- ప్రస్తుత కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గతంలో మూడు పర్యాయాలు అంబర్‌పేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అభివృద్ధి జరిగిందని అభిప్రాయపడ్డారు. డివిజన్‌లో వీధిలైట్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని విమర్శించారు.

నాయకుల మధ్య విభేదాలు..

- నల్లకుంట కార్పొరేటర్, డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. డివిజన్‌లో కార్పొరేటర్ చేపట్టే పాదయాత్రలు, ఇతర కార్యక్రమాలకు సీనియర్ నాయకులు, డివిజన్ ప్రధాన కార్యదర్శులకు కనీస సమాచారం ఇవ్వటంలేదని విమర్శలున్నారు. ఇటీవల చేపట్టిన డివిజన్ అధ్యక్షుడి నియామకంలో సీనియర్ నాయకుల అభిప్రాయాలు తీసుకోకుండానే కార్పొరేటర్ ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపణలున్నాయి.
- హైదరాబాద్‌లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో ప్రోటోకాల్‌పై కార్పొరేటర్ మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్నారు.
- అదే ప్రోటోకాల్‌ను డివిజన్‌లో జరిగే కార్యక్రమాల్లో స్థానికంగా ఉండే బీజేపీ సీనియర్ల విషయంలో పాటించడంలేదని నాయకులు ప్రశ్నిస్తున్నారు.
- గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నిరంతరం కష్టపడిన నాయకులను పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పార్టీకి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని పలువురు నేతలు అంటున్నారు.

వీధి బాలలకు అండగా చైల్డ్ రైట్స్ కమిషన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని వీధి బాలలకు తెలంగాణ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర కమిషన్ అండగా ఉంటుందని కమిషన్ సభ్యులు బి.అపర్ణ అన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం పురస్కరించుకుని అసోసియేషన్ ఫర్ రూరల్ అండ్ అర్బన్ నీడీ, రెయిన్‌బో ఫౌండేషన్ ఇండియా, బాల్యమిత్ర నెట్ వర్క్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీధి బాలల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.అపర్ణ, హైదరాబాద్ జిల్లా సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శైలజ, పూర్వ ఐఏఎస్ అధికారి విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో చైల్డ్ కేర్ సంస్థలలో పెరుగుతున్న పిల్లలకు ఏమైనా సర్టిఫికెట్లు తీసుకోవడం ఇబ్బందులను పరిష్కరిస్తామని



తెలిపారు. రెయిన్‌బో హోంలలో పెరుగుతూ, చదివిన పిల్లలు సమాజానికి ఆదర్శంగా ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మురళీమోహన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎం.శ్రీనివాస్, రెయిన్‌బో హోం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.అనురాధా, ఎస్‌ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, నవీన్‌రాజ్, నమ్మద్, క్రాంతికిరణ్, పార్వతి, శివరాణి పాల్గొన్నారు.

ప్రతినెల 1న పెన్షనర్ల వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెన్షనర్లకు ప్రతినెల 1వ తేదీన పెన్షన్ వేతనం చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేసన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం సుందరయ్య కళానిలయంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. కొత్త పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్ డీఆర్లను వెంటనే విడుదల చేసి హెల్త్ కార్డులను అన్ని ఆసుపత్రుల్లో అమలు చేయాలన్నారు. సుందరయ్య కళానిలయంలో రాష్ట్ర మహాసభలను త్వరలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజావతి, రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉప కార్యదర్శులు నాగేశ్వర రావు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్ ప్రారంభం



పద్మశ్రీ అవార్డు గ్రహీత మహ్మద్ వహీద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నల్లకుంట: పేద, మధ్యతరగతి ప్రజల కోసం మోయిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ వేంకటేశ్వరనగర్ కమ్యూనిటీహాల్‌లో 'కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్'ను ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రద్మశ్రీ అవార్డు గ్రహీత మహ్మద్ అబ్దుల్ వహీద్, డిప్యూటీ ఈఓ విజయలక్ష్మితో కలిసి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో విద్య, డిజిటల్ లిటరసీ ప్రాముఖ్యతను స్థానిక ప్రజలకు వివరించారు. ఫౌండేషన్ నిర్వాహకులు సంపత్, శశిరాజ్, విక్టర్ మాట్లాడుతూ.. గతంలో చదువుకునే అవకాశం లేక బాధపడుతున్న వాళ్లు ఉచితంగా కంప్యూటర్ పరిజ్ఞానం, విద్యను అభ్యసించాలనుకుంటే తమ కమ్యూనిటీ శిక్షణా కేంద్రంలో చేరవచ్చన్నారు. దీనికి ఎలాంటి వయోపరిమితి లేదన్నారు. కాచిగూడ ఎస్సైలు వీరయ్య, సురేష్ కుమార్‌లతో పాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత మహ్మద్ వహీద్‌కు పూల మొక్క అందజేసి సన్మానించారు

టోర్నమెంట్లతో క్రీడాకారులకు ప్రోత్సాహం



అంబర్‌పేట: టోర్నమెంట్లు యువతలో ఐక్యమత్యం, క్రీడా స్ఫూర్తిని చాటి చెబుతాయని కార్పొరేటర్లు తెలిపారు. బుధవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో జ్ఞానేశ్వర్‌గౌడ్ క్యాష్ అవార్డు వాలీబాల్ టోర్నమెంట్‌ను కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంబర్‌పేటలో ఔత్సాహిక క్రీడాకారులకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. శంకర్‌గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



నల్లకుంట: ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణకు సహాయపడుతుందని నల్లకుంట ట్రాఫిక్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) బేగంపేట ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ట్రాఫిక్, రహదారి భద్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నాగరాజు, నల్లకుంట లా అండ్ ఆడర్ ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఎన్ఎస్ఎస్ అధికారి బాబు, బేగంపేట టీటీఐ సిబ్బంది పద్మావతి, క్రిష్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటివెలుగు'ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్‌బీఎస్‌కే ఇన్‌చార్జ్ డాక్టర్ వసంత అన్నారు. బుధవారం అశోక్‌నగర్‌లోని పీఅండ్‌టీ కాలనీ బీఎస్ఎన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరంలో ఆమె పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 60మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అప్తామాలాజిస్ట్ సంధ్య, డీఈఓ కె.అనిత, ఎఎన్ఎం కిరణ్మయి ఆశవర్కర్లు జ్యోతి, సరిత, కె.లక్ష్మి, సుచిత్ర తదితరులున్నారు.

వినతి పత్రం అందజేత

నల్లకుంట: ఫీవర్ ఆస్పత్రి ప్రహరీ కూలిన చోట వ్యర్థాలు పెరుకుపోతున్నాయని నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గంటా లక్ష్మణ్‌ముదిరాజ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పిచ్చి మొక్కలు, చెత్త, చెదారంతో పాములు, తదితర విషపురుగులు వస్తున్నాయన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన బుధవారం వ్యర్థాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు.. !

- అచ్యుతరెడ్డి మార్గ్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు
- ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటేనే భయపడుతున్న ప్రజలు

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా తయారైంది అధికారుల తీరు. నూతన రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరి 24న రోడ్డును తవ్వి సుమారు 45 రోజులైన నూతన రోడ్డును నిర్మించకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు ఆ మార్గం మీదుగా వెళ్లే వేలాది వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



ఆందోళన చేస్తున్న అచ్యుతరెడ్డి మార్గ్ వాసులు

ముషీరాబాద్: ఆంధ్ర మహిళాసభ ఎదురుగా ఉన్న రోడ్డు నాలమయ్య కుంట వద్ద బ్రిడ్జి నిర్మాణం, స్టీల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండటంతో ప్రధాన రహదారిని మూసివేసి ప్రత్యామ్నాయంగా అచ్యుతరెడ్డి మార్గ్ రోడ్డును చూపించారు. ఈ ప్రధాన మార్గం ప్రారంభం కాకముందే ఈ మార్గ్‌లోని రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనదారులు ఆర్టీసీ క్రాస్ రోడ్స్, సెక్రటేరియట్, నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

- ఈ మార్గంలో రోడ్డు తవ్వి వదిలి వేయడంతో రోజుకు 3–4 ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు గాయాలపాలవుతున్నారు.
- అనేక చోట్ల కేబుల్ వైర్లు ఇతర వైర్లు బహిర్గతం కావడంతో వాటికి విద్యుత్‌షాక్ తగులుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటంతో డ్రైనేజీ లీకేజీలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాఫిక్ పోలీసులు ఈ మార్గం మీదుగా బారికేడ్లు అడ్డుపెట్టి ప్రత్యామ్నాయ మార్గాలు తెలియక బారిక్రేడ్లను తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు.
- ఓ అపార్ట్‌మెంట్‌లో రెండు రోజుల క్రితం ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. దీనికి తోడు ఇదే మార్గంలో ప్రతి గురువారం సంత జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపుల కూరగాయల వ్యాపారులు తోపుడుబండ్లతో పాటు తమ వాహనాలను కూడా నిలిపి వేయడంతో ఈ మార్గం పూర్తిగా మూసుకుపోయి వాహనాలు కదలలేని పరిస్థితి నెలకొంది. ఇదే మార్గంలో రెడ్‌క్రాస్‌కు చెందిన బ్లడ్ బ్యాంక్ కూడా ఉండడంతో అత్యవసర సర్వీసులు కూడా ఇదే మార్గం గుండా ప్రయాణిస్తున్నాయి.
- గత 45 రోజులుగా వాహనాల రాకపోకలతో దుమ్ము, దూళితో స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆందోళన నిర్వహించారు.

నేటి నుంచి పనులు ప్రారంభిస్తాం..

రోడ్డును తవ్విన తర్వాత కేబుల్స్, వాటర్‌లైన్లు కొన్ని దెబ్బతిన్నాయి. జలమండలి వంద మీటర్ల సివరేజీ పనులతో పాటు ఊడిపోయిన ఓ మ్యాన్‌హోల్‌కు మరమ్మత్తులు చేయించాం. రెండు రోజుల క్రితం ఈ పనులను మాకు అప్పగించారు. దీంతో 230 మీటర్ల వీడీసీసీ రోడ్డును గురువారం నుంచి ప్రారంభిస్తాం. అదనంగా మిగిలిన వంద మీటర్ల రోడ్డుకు నిధులు మంజూరు కాగానే మిగిలిన రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తాం.

–సన్నీ, డివిజనల్ ఇంజినీర్, జీహెచ్‌ఎంసీ సర్కిల్–15

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కాచిగూడ: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లోని మస్తాన్ సాహెబ్ మసీదు వద్ద ముస్లింలకు రంజాన్ కిట్టులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు సంతోషంగా పండుగ ఏసుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రంజాన్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు చెందిన పేదలకు చూయూత అందిస్తోందని అన్నారు. మసీదుల వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఫయిమ్, కురేషీ, అఫ్జల్, కరీం, సుభాష్ పటేల్, ప్రతిభ, బాలప్రసాద్, బి.భీమ్ రాజ్, రవియాదవ్, సంతోష్, సూరి, దినేష్, సాయి బాబా, నాగు, తిలక్, బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, బి.క్రిష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ..

అంబర్‌పేట: డివిజన్‌లో ఉన్న మసీదుల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని రామకృష్ణనగర్ దగ్గరలో ఉన్న మసీదులో ప్రభుత్వం రంజాన్ కానుకలను కార్పొరేటర్ ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. మసీదు కమిటీ నాయకులు సయ్యద్ హసముద్దీన్ ఘోరి, సయ్యద్ నసీర్, గౌస్ పాషా, మహ్మద్ అబ్దుల్, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, చుక్క జగన్, గోవర్ధన్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్ తదితరులున్నారు.



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీత వేస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు చాంద్‌పాషా ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో 7 వేల రంజాన్ కిట్‌లను పంపిణీ చేస్తున్నామని ఇప్పటికే 60 శాతం పూర్తి చేశామన్నారు. ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ నాయకుడు రహీం, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, షకీల్, ఆజీపాషా తదితరులున్నారు.

పేదల ఆకలి తీర్చడం స్ఫూర్తిదాయకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థల పేరుతో పేదల ఆకలి తీర్చేందుకు కృషి చేయడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ సామాజికవేత్త పాలేటి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్‌జీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1500 మంది పేదలు, నిరుద్యోగులకు అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలేటి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం గుర్తించి ప్రొత్సహించాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందూరి కృష్ణ, ప్రమోద్ అగర్వాల్, అడ్వకేట్ హెచ్.గోవింద్, కె.కౌశిక్, జ్వాలా వాలిని తదితరులున్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

రూ.13 లక్షలతో అభివృద్ధి పనులు

కాచిగూడ: చెప్పల్ బజార్ ధర్మపాల్‌లేన్‌లో రూ.13 లక్షల సీడీపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో దశలవారీగా అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తూ.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. డివిజన్‌లో పర్యటించి ప్రజలకు ఎమ్మెల్యే పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ తదితరులున్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

న్యూ రామాలయంలో చండీహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం



నల్లకుంట: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలో సీతా రామాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేపట్టారు. అనంతరం అక్కడి ఆవరణలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వాముల మంత్రోచ్ఛరణల మధ్య నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలను హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జయంతి పాల్గొనగా.. మధ్యాహ్నం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది.